UNIVERSAL
LIBRARY
OU_204970
UNIVERSAL
LIBRARY

సర్వస్వామ్యములు
సూర్యపత్రికాఫీసువి

రాజన్ ఎలక్ట్రిక్ ప్రెస్
రాజమహేంద్రవరము.

# ముని మాపు

సహదేవ సూర్యప్రకాశరావు

ప్రథమ ముద్రణము : హేమంతము, ప్రభవ.
ద్వితీయముద్రణము : హేమంతము, శ్రీముఖము.

# సరస్వతి

బ్రతుకుబ్రతు కెల్ల శిథిలమ్మై పదటఁ గలియ
వీథివీథులఁ దిరుగాడు బిచ్చగాఁడ
నీమృదుపదాంకితమ్ముగా నే మొనర్తు
లలిత హృదయప్రసూన దళమ్మె గాక

# ప్రణయాంకము

మధుసుధాజ్యోతిరానందమగ్న మైన
బ్రతుకు మలినదుఃఖాశ్రుకర్దమ మొనర్చి
భావనాచాలితోత్తుంగభంగవీథి
పర్యాప్తిఁగాఁ జేసి యున్మత్తురీతి
ఘోరకలుషాంధకార గంభీర భయాద
కూపకుటిలగర్భమ్ములోఁ గూలఁద్రోసి
మెఱపుగాఁ దారగా నింట మెఱయుటకునుఁ
లేఁతరాగము నించు తెగ నుషోరేఖలీల
నిదురమఱపున స్వప్నంపు నీడజాడ
మాయమైపోతి వో సుకుమారహృదయ !

చెలియ, ఏనాఁడు నేను గాంచితినో నిన్ను
నాఁడె నీపదార్పణ చేసినాను హృదిని
అపుడు దానిని గాఢలజ్జావకుంఠ
నమ్ము సడలించి హత్తుకొన్నావు,

ఇపుడు,

నానితాంతప్రణయరాగనవవాశ్రు
మౌక్తికము లేర్చి కూర్చితి మాల్య మొండు
తరళతారకాచకితహస్తముల దీని
స్వీకరించి నీహృదయాన చేర్చికొమ్ము,

అంత నేను గైకొందు ననంతశాంతి
విజనగంభీరశర్వరీవీథి నిచట.

# హృదయసుమము

దళముదళమున ప్రాయంపువలపు లొలుకు
ఈమనోహర సుకుమార హృదయసుమము
తలఁపు లీడేర మనసార తనివి దీర
కానుకఁగా నీకు నర్పింపఁ గాఁదలంచి
వీథివీథులఁ దిరుగాడి విసిగివిసిగి
నీగృహప్రాంగణము జేరి నిలిచియుండ
చైత్రమాసాంతమున వానజల్లువోలె
పండువెన్నెల నునుమబ్బుపడవరీతి
మేదురపయోదముల చిన్నిమెఱపుకరణి
కన్నెసిగ్గుల చిఱునవ్వు చిన్నెయట్లు
వలపువలె చుక్కవలె ఏలపాటవలెను
చాయగాఁ దోఁచి మాయమైపోయితి

అప్పుడు

చిరతరస్నేహ యవనికాంతరమునందు
తరుణప్రాయంపువలపు దొంతరలు వెట్ట
వఱదవాఱు కవోష్ణబాష్పములతోడ
బడలి మూతలువాఱు లేమెఱుఁదతోడ
సెగలుజిమ్మెడు నిట్టూర్పుపొగలతోడ
ఎదకొఱకు ప్రేమకొఱకు నా బ్రదుకుకొఱకు
నీకొఱకు మైమఱచి అట్టె నిలిచినిలిచి
త్వన్మధురరూపదర్శనభాగ్య మింక
నాకు లభియింప దని అధోలోకములకు
క్రుంగి క్రుంగి దుఃఖపడితి...

# ప్రేమగానము

జలదపటలమ్ము క్రమ్మినసమయమందె
మింట తేజస్సు గురియును మెఱపుకన్నె,
చిమ్మచీకట్ల తెరలఱ నాచిత్తసీమ
విరిసినప్పుడె నా కగుపించె దీవు.

ఈ మహాసృష్టిలోన నా కిప్పు డేది
కానిపించిన నీచాయగానె తోఁచు,
కన్ను మూసితినేని నీ కమ్రమూర్తి
మ్రోల నిలుచును చిఱునవ్వుమోముతోడ.

మధురయౌవన వాంఛాసుమమ్ము లెల్ల
కోసి నీ కోసమే దండ గ్రుచ్చుచుండ
పూవులెల్ల క్షణక్షణమ్మునకు వింత
వింతసౌరభముల వెల్లివిరియఁజేయు.

తప్తహృదయప్రశాంతి సంధాయకములు
భావకామల నామాంకితమ్ములైన
ప్రణయగీతాలు గొంతెత్తి పాడుచుంటి
పరవశత నేఁడు నను నేనె మఱచిపోయి.

ఎలమావితలిరుటాకులమేసి కోయిల
గొంతెత్తి ఎ[illegible]పాట కొసరుచుండె,
తనచెలితోఁ గూడి ననదేనెత్రావుచు
తేటి పాటల మున్గి తేలుచుండె,
అలలతో నిసుకసెజ్జల నాట్యమాడుచు
గౌతమీనది గానకళల గురిసె,
పూలతో దాఁగుడుమూఁతలాడుచు మంద
పవనుండు మెల్లఁగా పాడుచుండె,

మనము గూడ మృదుప్రేమమయములైన
హృదయములఁ గెల్చుకొని గానముదితమైన
ప్రకృతిముగ్ధులమై సుఖస్వప్నములను
గాంచుదము కేవలానందగానపరత.

# అశ్రుపాత్రిక

నా సమున్నతవాతాయనమ్ము చెంత
నిలిచియుండి, నీకోసమే నిర్నిమేష
దృష్టి వీధీముఖమ్ము వీక్షించు కొనుచు
వేచియుంటి నీ నిశ్శబ్దవిజనరజని.

అలికి డేదేని వినిపించినంతమాత్ర
కనులు విచ్చి, నల్గెలఁకులఁ గలయ వెదకి
నిలువునిలువెల్ల చలియింప కలఁగిపోదు,
వేఁడినిట్టూర్పు కౌఁగిళ్ళ వేఁగిపోదు,

ఈనిరీక్షదీక్షారతి నే ని కెంత
సేపు దుఃఖతమస్సమాశ్లేషమందు
నిమిడి శూన్యవీథుల పరికించుకొనుచు
ఈ ప్రతిక్షణయుగముల్ గ్రమించు టెటులో.

కనికరము గల్గి ప్రతిఫలాకాంక్ష లేని
నాదుప్రేమ గ్రహించి యెనాఁటికేని
కలికిబంగారు రెక్కలు కట్టుకొనియు
గాలిపైఁ దేలి ఈపేదకడకు నీవె
వచ్చి వ్రాలుదు వన్న విశ్వాసమునను
నా నిరంతర ప్రణయబాధానితాంత
రాగశోణితబాష్పధారామృతమ్ము
నాహృదయపాత్రిక నింపినాను సకియ,
త్వత్ప్రణయజీవితపిపాస బాపుకొనక.

ఈవసంత దినాంతవేళావసాన
సమయముల గౌతమీనదీసైకతముల
కరముఁగరమున గీలించి ఇరువురమును
పక్షులట్టుల గీతాలు బాడుకొనుచు
ప్రేమమూర్తులమై విహరించు టెపుడో

# భిక్షు

భాసురపరీమళార్ద్ర పుష్పాల నేఱి
తెచ్చి, ప్రేమమై నొకదండ గ్రుచ్చుచుండ
మృదులహస్తాంగుళులనుండి చెదరిపోయి
నేలపై రాలిపోయె నాపూలచాలు.

ఆనదీసైకతశ్రేణిపైన పొంచి
పెరిగి విఱిగెడి తరఁగలవింత గనక
సంజనీహార్వి సొగసులజాడ గనక
నన్నుక్రేగంటఁ గాంచుచున్నావు నీవు.

నీకనుగొలుకులందుండి నిత్యనూత
నానురాగరేఖావీక్షణప్రభూత
మధురగీతికామాలికల్ మలయునంత
ముసురుకొనె నెద భావజీమూతచయము.

ప్రణయరాగార్ద్రగీతాలు పాడఁదలఁచి
నవ్యరీతిని గొంతెత్తినాను కాని
నీరవంబయ్యె ప్రేమగంభీరగళము,
హేతు వేమో యటంచు కంపిల్లె నెడఁద.

తావకారుణరంజితాధరముపైన
నృత్యమాడు హాసమ్ము వెన్నెలలు గాయ
ఆయమృతచంద్రికాస్మితచ్ఛాయలందు
చేరుకొనియె నాహృదయచకోరకంబు

మధురజీవమ్ము మలయకుమారా కొసఁగి
విరినెలంతలు మ్రాఁగన్ను వెట్టుచుండె,
ఓతపస్విని, ప్రణయముహూర్తవేళ
యాయె, జేరనిమ్మిఁక మృదులాంకపీఠి.

తారకాస్ఫుటతరళాంశువారమందు
ప్రణయదాహాన నాయెద బడలువాఱె,
తనివితీరఁ గా ప్రేమామృతమ్ముఁ గ్రోలి
సుప్తిఁ గాంతు నీహృదయప్రసూనశయ్య.

# ప్రతిఫలము

సకలము త్యజించి నీకోసమె కృశియించి
యిటుల సగమయిపోయి నే నేడ్చుచుండ
కిలకిలమటంచు నవ్వుచు కేరుకొనుచు
ఆమహానంతనీలసౌధాగ్రమందు
ఆత్మసఖులఁ గలసి ఆటలాడు నీవు
ఎటు లెఱుంగఁజాలుదువు నాహృదయ మెంత
దగ్ధమగుచున్నదో నిన్నె తలఁచుకొనుచు.

దివ్యప్రేమానురాగదీధితులఁ జిమ్ము
విమలహృదయమ్ము నీకె నైవేద్యమొసగి
నీపదాభిషేక మ్మొనరించినాఁడ
రక్తసిక్తాశ్రువారిపూరమ్ముతోడ.

ఓఘృణాదరిద్రహృదయా, ఓకఠోర
రాగశాలినీ, ఏమి నాబ్రతుకో గాని
ఒక్క వెచ్చనికన్నీటిచుక్క నేని
ఒక్కగాటంపువేడినిట్టూర్పు గాని
విడువవే, స్వార్థమే లేని ప్రేమ గాంచి

నన్ను వలపింపవల దిఁక, నిన్నె నేను
తలఁపులూర మనసుదీర వలచికొందు
త్వత్ప్రణయరేఖకాదరిద్రాణమైన
నావిఫలజీవితము చిఱునవ్వుతోడ
నీహృదయశాంతికై ఒక్కనిడుదయూర్పు
కూడ కాకుండఁగా విడనాడుకొందు.

# కాంక్ష

ఏ మెఱుంగని నా ముగ్ధహృదయమందు
ఆఱిపోని తీవ్రప్రణయాగ్ని కొలిపి
ప్రేమసీమాంతముల కీవు వెడలిపోతి
వేల, న న్నీదురంతదుఃఖాల ముంచి.

పూవుకన్నె ప్రేమ హరించి జీవితమ్ము
వమ్ముచేసి వెడలిపోవు పవనుపగిది
యౌవనాశాప్రసూనరేఖావిలాస
వాసనాప్రసారమ్ము భావ్యమ్మె సకియ.

ఏల న న్నివిధాన బాధించెదీవు
హృదయరాగసర్వస్వ మర్పించినైచి
నిడుదయూర్పులతోడ కన్నీటివేడి
బిందువులతోడ పేదనై మిగిలినాఁడ.

యౌవనాంగివి ప్రణయ రాగార్ద్రహృదయ
నీకు సహింపఁగారాని యీవియోగ
దుఃఖసాగరగర్భాన త్రోసివైవ
ఎవ్వరున్నారు నన్నాదరించువారు

హృదయకుహరాన మాఱు మ్రోగిల్లి వెడలు
శోకగీతాలు నీచెవి సోఁకలేదొ
ఎడఁద నులివెట్టి విదలించి ఏర్చి వెడలు
వేడియూర్పుల కెడఁద కంపిల్లలేదొ

ఈవిధివిపర్యయమునకు నేమనందు
విధివిరామమే లేక నావింత బ్రతుకు
బహుళకష్టప్రయాససంభరితమయ్యె
ఆర్ద్రమయ్యె నాయెడఁద దుఃఖాశ్రువారి

ఈయెడఁద కింక ఈధరిత్రీతలమ్ము
లోన లభియింపదో లవమ్మైని శాంతి
అన్నెముఁ పున్నెమెఱుఁగని యట్టి నాదు
జీవితము దుర్భరంబయి పోవు నేమొ

ఈ విశాల విశ్వమ్మునం దే నొకండ
కఱవుకన్నుల నాశాముఖమ్ములెల్ల
వడవడ వడంక పరికింపఁ దొడఁగినాఁడ
ప్రణయరూపాన గాన్పింతు వనెడి యాస

# ఆమె

ఆమె వచ్చి కూర్చుండె నాయంతికమున
ముగ్ధనేత్రాలతో మౌనముద్రతోడ

ఆమె పెదవులు చైత్ర సంధ్యావసాన
వేళ మసృణానిమ్ముల లాలనముల
జోగి యశమ్ములై పోయి సోలి తూలు
లేఁజిగురుటాకులట్లు చలించుచుండె.

అశ్రుపూర్ణమై గంభీరమై ప్రశాంత
మైన యామె వినీలనేత్రాంతరమున
ప్రేమవిహ్వలదృష్టి సారించినాను

ఆమె కంటిక్రొన్నీటిముత్యాలతళుకు
జిలుఁగు వెలుఁగులో నిలువెల్ల పులకరింప
ప్రతిఫలించిన ప్రణయప్రపంచ మెల్ల
గాంచినాఁడను వలపూర కఱవుదీర

నృత్యమాడు నీలాలక నీరవస్వ
నమ్ములో మెల మెల్ల వినంగనయ్యె
ఆర్ద్రయౌవనాంచితహృదయాంచలమ్ము
లొరసి యొగయు ప్రణయగీతఝరుల మ్రోఁత.

# నేను

ఆ యనంత గంభీరోన్నతాంబరమున
శబలితార్ద్రరోచుల నవసాంధ్యవేళ
మధురముగ నటియించు జలధరదివ్య
సీమ నిత్యనూత్ననివాస భూమి నాకు

మధురపీయూషలహరి నామాతృమూర్తి
దప్పిచే తపించి తపించి దశదిశాంత
రములు వెఱ్ఱిగా గాలితరగలఁ గలసి
పరువులెత్తిపోవు మధుపిపాసి నేను

ప్రతిదినోదయాస్తమయమ్ములందు నేను
పూలకన్నెల ప్రణయగీతాలరుచుల
నాలలిత జీవితార్ద్రపత్రాలకొనల
మోసికొనిపోదు ప్రేమావకాశములకు

# వలపు

పొడుపు పూతల మెరుపుజూపే
పారిజాత ప్రసవకోమలి
తరుణలావణ్యామలశ్రీ
వలపె వాసించున్

అరుణభానూదయశుభోత్సవ
పరత విరిసే వద్రీహ్రాద
యాన మొఱసే తేఁటిపాటల
వలపె తలసూపున్

చిగురుపయ్యెదముసుఁగు తెరలో
నెగయు కోయిల వగరుగొంతుల
వెలిగిపోయే తీయఁదనముల
వలపె వికసించున్

మఱుఁగుసంజల రేఁగు రంగుల
మెఱుగువాతే మొగిలుకన్నెల
చీరచెరఁగుల వన్నెవన్నెల
వలపె నటియించున్

బరువువాఱిన వార్షికాంభో
ధరశ్యామల గర్భపథముల
మెఱసిపోయే మెఱపు నిలువున
వలపె పులకించున్

పాలబుగ్గల పూయు నవ్వుల
కన్నెపడుచుల వన్నెసిగ్గుల
యౌవనాంగుల కావిచూపుల
వలపె మొలకెత్తున్

# కొన్ని వేళల

తరళతారకామండితాంబరపథాన
తోడిమబ్బుకన్నియలతోఁ గూడి ఆడు
కొనుచు హాయిగా విహరింతు
కొన్ని వేళ
లందు సూర్యసుతామధురామృతోర్మి
కా నికరమాలికాడోలికలను దోఁగి
పోదు
మరికొన్ని వేళల పూర్వపరిచ
యమ్మె లేని దివ్యాంగనాహాసవల్లి
కామృదులకోరకమ్మునై కరఁగిపోదు,
ఇంక కొన్ని వేళల హేతువేని లేని
నేను నాలోననే నవోన్మిషితసోత్స్న
వాంబరపథాల దివ్యనాట్యము లొనర్తు

# సంధ్య

ఆమె పాదలాక్షారేఖికార్ద్రమసృణ
రాగమంజరీమాధురీరక్తిమమున
నాయుఃరమ్ము లేఁతచివురుచాయ లీను
కమ్రపశ్చిమాకాశ సంకాశ మయ్యె.

సకలరాజన్యమూర్ధన్య మకుటపాళి
వామపాదమ్ము దక్షిణపదము వీథి
వీథుల జరియించి జీవించు బిచ్చగాండ్ర
శిరసులం దుంచి నర్తింతు చిత్రగతుల.

శోకగీతికి దరహాస సూనమునకు
అమృతరాశికి భయదవిషార్చులకును
నామమాత్రభేదమె కాని నాకు మాత్ర
మన్నియేకతుల్యమ్ముగా హ్లాద మొసఁగు

ఏను ప్రతినిమేషమ్ము నే రెఱుఁగకుండ
ఊర్పుగా ప్రసవమ్ముగా నుడుగ కలగ
చంద్రరేఖగా నాతపజ్వాలగాఁగ
మాఱిపోవుదు వింతగా మాయమాదు.

# ప్రళయము

నా విశీర్ణకుటీరాంగణమ్ము వీడి
పసుపునిగ్గులవసనాలముసుగుఁ దాల్చి
దక్షిణోద్యానవని కీవు తరలినావు
విషమగీతుల నెడఁద కంపింపఁజేసి

అమితదారుణమారుతమ్మపుడు రేఁగ
భీషణోన్మత్త మేఘగంభీరరసిత
ఫెళాఫెళార్భటి దిశల కంపిల్లిపోవ,
అపుడు ప్రళయమ్ముగ్రమ్మినట్లాయె నాకు

దద్దరిల్లెడు దశదిశాంతముల గాంచ
నెఱుకబడరాని వేవో దుర్భరదురంత
వేదనాస్మృతులేవో జీవితము గాల్చ
నెటుల జీవింపఁగా నేర్తు నింక నేను

ఈ యగమ్యాతమస్వినీ హృదయసీమ
నీలియాకసమే తోడునీడగాఁ గ
నలరుటెద రేఁగి వేగించు కలవరమ్ము
నెల్ల వింతగీతికలగా నల్లి వేయి
గొంతుకలతోడ నే పాడుకొనుచునుంటి
రోదసీగహ్వరమ్ము మార్మ్రోగిపోవ

# జీవితస్మృతి

వింతవింతయందాల త్రుళ్లింత లొలయు
సంజనెరకావి సొగసులజాడ గనుచు
పూతగోదావరీనదీపులినసీమ
క్షుభితహృదయుఁడనై ఒంటిఁ గూరుచుంటి.

మనుజహృదయమ్ములకు నగమ్యమ్ములైన
మధురగీతాలతో పవమానవీచి
కానరణి నిత్యనూతనకలనఁ దేలి
పోవుచున్నవి గుంపులై పులుఁగు లెల్ల.

నిర్మలంబైన గౌతమీనీరమందు
తనసొగసువన్నెలను చూచుకొనుచు సందె
చెరఁగులను సర్దుకొను నభశ్శ్రీలతాంగి
నరసి సౌందర్యముగ్ధుఁడనైతి నేను.

కనఁ బడదు మింట చిరుమబ్బుతునుక యైన
కలికికాంతుల కూనురాగాలతోడ
చుక్క లొక్కొక్కటిగ తొంగిచూడ సాగె
ప్రకృతి గంభీరశాంతముద్రను వహించె

ఈ యనంతవిశాలమహీతలమ్ము
శాంతిసంతోష రేఖా ప్రసన్న మిపుడు
కాని నా ముగ్ధహృదయమ్ములోన నిట్టె
తొలకరించిన దేనాటి కలవరమ్మొ

విడివడసు గొంతు సంక్షోభపడెడు నెడఁద
మూఁతవడియున్న కన్నులజ్ఞాతశూన్య
సీమ చెరగిన యడుఁగులచిన్నెలెల్ల
తలఁపునకుఁదెచ్చు యౌవనార్ద్రానురక్తి.

ఇది ప్రశాంతావకాశము నేనొకండనె
ఈ విషాదాంత ప్రణయగాధావిశుష్క
జీవితస్పృహలను జ్ఞప్తిచేసికొనుచు
తడుపుచుంటి కవోష్ణాశ్రుధారసోనల

గడియ లొక్కొక్కటిగ శూన్యగతులతోడ
జరిగిపోవుచునుండె, అంబరతలాన
మబ్బుగ్రమ్మెను, చుక్కలు మాయమయ్యె
గౌతమీనది నిద్రలో కలవరించె.

# విషాదగీతి

సంజకెంపుల సంతరించిన
మొగిలుకన్నెలు విప్పు చాయల
నలరువాసన లందగింపగ
ఱిచ్చవడిపోదున్.

సోగకన్నుల సోగయుకాంతుల
తీఁగవాఱెడు తేటనవ్వుల
మొరసిపోయిన మెఱుఁగుఁదీఁగ
కలఁచు హృదయమ్మున్

చదల మబ్బులు జలదరింపగ
మెఱపుదీవలు పులకరింపఁగ
కోలుపోయిన వేవొ యేవో
కనుల మినుకుమనున్

పైఁడిదారుల వ్రాలు సంజల
కన్నుమూసిన చిన్నిపూవుల
కొఱకుఁ దిరిగెడు కొదమ తేఁటుల
నరయ నెద వడఁకున్

స్మృతికిఁ దట్టిన దుఃఖ మేదో
హృదయ మేర్చెడు కోర్కె యేదో
మాటిమాటికి మరిగి రేఁగఁగ
బ్రతుకు తపియించున్

తలఁపు తలఁపున వెలుఁగు చిచ్చుల
అడుగు అడుగున పొడమువాంఛల
హృదయమ రక్తము లంటి త్రెంచెడు
వెలుఁగెదో వెడలున్

విరతి మెఱుగని వేడియూర్పులై
కరఁగిమరగిన బాష్పకళికలై
పెరిగి విరిగెడు విషమగీతులై
జీవికల నొరసెఁ

దిక్కు దోఁపక తెన్నుగానక
కాళరాత్రులగర్భవాటుల
బ్రతుకు బరువుల పాటతో సాధి
యించి పోవుదునా.

# ఒక నాఁడు

చల్లఁగా మెల్లఁగా సాగు పిల్లగాలి
తరగలందు కలసిపోవు విరులవలపు
వోలె రజనీవిలాసిని మేలిముసుఁగు
ఛాయలం దైక్యమైపోయె సాంధ్యరోచి.

కన్నుకన్ను పొడుచుకొన్న కానరాని
కలుషనిబిడతమస్సమాక్రాంతభయద
మీ విజనగౌతమీస్రవంతీవిశాల
తీరమం దొకనాఁ డొంటిఁ గూరుచుంటి.

నా సమీపపాదపపల్లవాసనమున
నేకతమ్మునఁ గూర్చున్న ఘూకకాంత
ప్రణయవృద్ధులకేని యర్థమ్ముకాని
భావగీతమ్ము లెడనెడ పాడుచుండె.

ఆ గభీరనిశాసమయాంతరమున
ఉడుగణమ్ములే కనువిచ్చి ఊర్వినాపి
చీకటుల్ బులకింప వీక్షించుచుండె.

గౌతమీవీచికామాలికామనోజ్ఞ
నిర్మలానందగీతాల నిశ్వనములు
నిత్యకళ్యాణి విశ్వవైణికు ననంత
గానపషేల విశ్రాంతి గాంచుచుండె.

ఆ విషాదతమోలీనమైనరాత్రి
లలితహాస్తనీరేజయుగళమునందు
నిదురగాంచె ప్రకృతిరమణీమతల్లి.

అంతు లేని మహానీరవాంధకార
యవనికాభ్యంతరమ్ము నాయలరుపెడంద
చీల్చికొని చీల్చికొని, సుఖశ్రీ నొసంగు
భావనాలోకలోకాల వ్రాలె

అపుడు

దారి పఱతెంచు మలయసమీరణుండు
ప్రణయఃశాలినీ వేదనాభావసీమ
పరిమళించిన యొకరహఃప్రణయగీతి
మోసికొనివచ్చి వదలె నామ్రోల కంత.

అంతలో నంత లేని యూహాప్రపంచ
మెల్ల సుఖస్వప్నమట్లు గతించిపోయె,
గాఢనిద్రాభరమ్మున కన్నుమూసి
యున్న ప్రకృతిరమణి యుట్టె ఉలికిపడియె.

ఆ దురంతప్రణయగతకారంవమ్ము
పూతగౌతమీకల్లోలినీతరంగ
రాగరావమ్ములో లీనమై యెడంద
మూలల నొదిగిన దుఃఖాల మేలుకొలిపి.

## పికము

కమ్ర నీల ఫాల్గుణమాస గగనలక్ష్మి
అఱుతఁ దాల్చెను మంచుముత్యాలసరులు.
గాఢదుఃఖాంతవిశ్రాంతగాఢ మఱచి
హృదయములఁ గల్పుకొని విద్రింప సాగె
హాయిగా కులాయముల విహంగమములు.
విశ్వవైణికుతో శ్రుతివేసికొనుచు
వృద్ధగోదావరీతపస్విని మనోజ్ఞ
కంఠమునఁ బాడుచుండె రాగములు గురియ.
ప్రకృతి నూత్నలావణ్యరూపమ్ము దాల్చి
నెరపుచుండె నిత్యోత్సవనృత్యకేళి.
ఈ సుధారాగరంజిత మీధరిత్రి
నెవ్వఁడే కరుణాహీనహృదయుఁడెవఁడె
పికమ, నావలె మౌనజీవితపు యాత్ర
చేయఁగా నిన్నుగూడ శాసించినాఁడు,

# నే నెఱుంగుదు

నే నెఱుంగుదు నామెను నిత్య మామె
జీవితోన్మీల సౌందర్యశీకరముల
నెల్ల కకుబంతముల విరజల్లుకొనుచు
పవనపులకితములు మార్దవములు ప్రేమ
చకితములు నైన పుష్పపుత్రికలఁ గలపి
కుముదవల్లీ నికుంజాల కొంతసేపు
క్షుభిత కల్లోల శిఖరాల కొంతసేపు
సంతతోత్సవాంబరతలి కొంతసేపు
నవనవానందమధురి మోన్మత్త గతుల
నృత్యకేళీవిహారముల్ నెరపుచుంట
నే నెఱుంగుదు...

ఇప్పుడామె

పువ్వుటెడందలో బ్రతుకు బరువులు హెచ్చె
అలకజాలకలు గుసగుసల మునిఁగె
దుఃఖదేవతా నిశ్వాసధూమ మామె
కనుల నీలినీడల చాయ నణఁగిమణఁగి
అప్పుడపు డామె ముఖసీమ నావహించు
టే నెఱుంగుదు...

ఇప్పుడపుడు

నన్ను గాంచఁగా లే కలనల్ల నామె
మోము వాంచి నేత్రమ్ములు మోడ్చి కుమిలి
కుమిలి లోలోన మఱిమఱి క్రుంగు

నేను

దూరమున నామె బరికించి తొలఁగి పాఱి
చిచ్చఁబడి త్రుళ్లిపడి కుమారిలుదుఁగాని

నవ్యరాగోదంచితంబా
దివ్యవీధిని తేజరిల్లే
తళుకుచుక్కలు జిలుఁగువెలుఁగుల
తరలి ర మ్మనెడిఁ

జీవసారము జిమ్ముకొనుచూ
పూవుటెత్తుల ప్రొద్దుపుచ్చే
అళికుమారులు ఆర్ద్రగీతుల
నాహ్వానించెడిఁ

వెండిపూవులు విరిసిపోవఁగ
పెరిగిపోవుచు మిన్నుముట్టే
విఱుగు తరగలు కరము లెత్తి
వేగఁ బిల్చెడినే

ఈ కనుసన్న లెవరికోసమో
ఈ మధుగీతు లెందుకొఱకో
ఈ సందేశ మేమిటికో
నే నెఱుంగనే

ఎఱిగియుండిన మఱిసిపోవుచు
మెఱసిపోయీ సురిగిపోయే
మెఱవుతీవతో కిరణరేఖతో
తరలిరానే సఖి

# వి యో గ వీ థి

మృదుమధురమైన గొంతుసారించి నీవు
తీయనౌ జీవరాగగీతికల బాడి
ఆర్ద్రహృదయప్రసూన శయ్యాప్రసుప్త
కోమలప్రేమలక్ష్మి మేల్కొలిపినావు.

పూలనెత్తావిముత్తాల తేలియాడు
అనిలుడనుకూలబాంధవ్యమును వహించె
చివురుమేతల జేవురించిన గళంబు
లెత్తి పాడెను దుడుకుకోయిలల గుంపు.

ఆనిముసమందె నాకీసమస్తజగతి
నిత్యనూతనకళ్యాణ నిలయమయ్యె
మిసిమివెన్నెలలో శరన్మేఘశకల
మట్లు తిరిగితి ప్రేమసీమాంతరముల.

దక్షిణానిలు కౌఁగిలింతలకు కులికి
వలపు నెగఁబోయు మల్లికాప్రసవమట్లు
దోఁచియిచ్చితి నీ సవ్వ్యతునుః కలరి
సిగ్గు వీడని వలపు మచ్చికల నెల్ల

పూవుదేనియఁ ద్రావుచు జీవితంపు
పాటమాటనె మఱచెదు తేఁటివోలె
వలపు నులివెచ్చనైన నాపడుచుఁ దనపు
తల పులం మునింగి భావి నేఁ దలఁపనైతి.

ప్రేమసుధ నింపుకొనిన ఈ హృదయపాత్ర
దొరికె నని యుబ్బితిని గాని అరయనైతి
పెదవికిని పాత్రకును మధ్య భీకరంపు
విప్లవము దెచ్చు విపరీతవిధినియుక్తి.

జీవితామృత మెల్ల వర్షించివైచి
పేదవడెను విషాదపయోదమట్లు
నా సమస్తమ్ము నీ కర్పణమ్మొనర్చి
ఊర్పు చిఱుగాలికే తూలుచుంటి సకియ,

విచ్చుటాశల కొనగోళ్ల గుచ్చిగుచ్చి
చిదిమి చెల్లాచెదరుగాఁగ చేసివైచి
పూవప్రాయపుటెదను నపూర్వసుఖము
గగనకుసుమమ్ముగా చేయనగునె చెలియ,

ఈ వియోగశోకమ్ము సహింపలేక
విరిసివిరియుని యెద నేర్చి వెడలుచున్న
కన్నెతలఁపు లన్నిటిగూర్చి నిన్నుగూర్చి
పాడుకొనుచుంటి నీరహఃప్రణయగీతి.

ప్రళయభీకరమై హఠాద్భగ్నమైన
పంకిలాత్ముని ఘోరదుస్స్వప్నమట్లు
ఈ విషాదవేదన భరియింప లేని
నా బ్రతుకు భగ్నమహా నేక్షణమ్మొ సకియ,

ఓ వసంతవయస్వినీ, నీవు లేని
ఈ యెడారుల దారులం దింకకుండ
దాఁచుకొన్నాఁడ నాహృదంతరమునందె
వలపుకన్నీటిసెలయేటి అలలపాట.

# కాని

ఆ వసంతోదయమ్మున ఆమనోజ్ఞ
సాంధ్యవేళ ఆనూతనోచ్ఛ్వసితకుసుమ
రాజితారామసీమాంతరమ్మునుండి
చెదరు నిట్టూర్పుగాడ్పుల పెదవు లదర
మృదుకపోలపాళి నరుణరేఖ లొలయ
హృదయ ముద్వేలమున చలియించిపోవ
పువ్వుదారుల క్రేగంట నవ్వుకొనుచు
పదము తడఁబడ తొట్రిల కదలి వచ్చి
ఈ సుమమ్ము గైకొమ్ము స్వామీ యటంచు
నొక్క మల్లికాప్రసవమ్ము నొసఁగినావు

అది యమృత మొల్క నీ దరహాస మేమొ
అది ప్రణయసుధ జల్క నీహృదయ మేమొ
అని భ్రమించి నేత్రమ్ముల కద్దుకొనియె
పదిలపఱచుకొన్నాఁడ నా హృదయపేటి

ప్రేయసీ, ఆ లతాంతమ్ము వింతవింత
వాసనల దిగంతమ్ములఁ బఱపుచుండె
నిముసనిముసమ్మునను గూడ నేఁడు

కాని

# శూన్యగృహము

నాహృదయమ్మువలెనె

నాగృహ మ్మసహ్యమ్ము శూన్యమ్ము నేఁడు
దుర్భరవియోగశర్వరీగర్భభార
మిం దెగసిపడి కలవర మందుచుండు.

ఇందు ముం దెన్నఁడో జీవితేందుతరళ
కౌముదీప్రశాంతవిలాసకళలు మెఱసె
ఇందు ముం దెన్నఁడో మృదుహృదయరాగ
తరుణసుశ్రావ్యదివ్యమాధురులు గురిసె.

ఆ వివిక్తనిశ్శబ్ద గృహాంతరమున
నిపుడు నాగుండె చప్పు డాలించి నేనె
క్రమ్ము దుస్సహానంత దుఃఖమ్మువలన
కుంచుకొనిపోయి, లోలోన కుమిలిపోదు.

ఎన్నఁడేని యాశాలేశ మొకఁడ పులక
రించెనేని విరిసికొన్న యిరులచాయ
నించుకేని చలించి నటించలేక
అదిరిపడి పాఱు లేవెలుఁగై నశించు.
నా హృదయవిదారణదారుణప్రచండ
వేదనాలాప గీతికారోదనమ్మె
భయదజీమూతమందిరద్వారసీమ
తెఱచికొని జిమ్ముకొని రేఁగు దెసలదెసల.

# తార

మసకచీఁకటిరేకుల విసపుచాయ
మూలమూలల, దిశల, క్రమ్ముకొను శీతు
కారుసంజ, మబ్బేనియుఁ గానరాదు
మింట, కలఁగబారినది కాశ్మీరరోచి.

నీలినీడల దారులచీలిచికొని
మినుకుమనక చలింపక మెఱయఁబోక
జారు పొగమంచు తెలిచీరచాటునుండి
క్రిందుమీఁదుల చూడసాగినది తార.

పాడుకొనుచు పాడుకొనుచు పరవశాన
మూఁగవోయినదియుఁబోలె మోము వాంచి
చెప్పలార్పక భవితవ్యదృశ్యమేదో
కనులపడఁగ నిశ్చలసమాధినిమునింగె.

తీరుతీయమ్ముచిటుల ప్రతిదివసమ్ము
జీవితాములరాగరంజిత మొనర్చు
తిమిరగానకళ్యాణోత్సవములఁజొరక
కుంచుకొనియె నిశాదేవికూడ నేఁడు.

ఈవినీలవియోగకుఁటీవిటంక
సీమ నేకాంతపూజలోచిందువారు
కంటక్రొన్నీరుమున్నీరుగా స్రవించి
బాహిరిలునేమొ, ఇపుడుకల్పాంతమేమొ.

విస్తరింపఁజాలని రహోవిరహాకిరణ
తప్తశోకారుణాంధనుప్తగీతి
కురియుచున్నది మాలిన్యమిరియుకొఱకొ
కనుకొనలజారిపడు నీలి కలలకొఱకొ.

ఆశలన్నియు తెగి సర్వనాశమయిన
ఇంతతారుణ్య మింతయనంతతృష్ణ
ఇంతపరిశాంత మింత నైస్పృహ్య మెటుల
దాచికొన్నదో శీర్ణహృదంతరమున.

నిలుకడలులేనితలఁపునీడలమరంగు
బ్రదుకుదాచుకో దుర్వ్యథఁ బడికృశించె
సౌహృదయజీవగీతి ప్రసన్నబుద్ధి
తొలకరించునే, విరియునే వలపుటాస.

కనలేదూర్పులవంతెనఁగట్టికొనుచు
తుదిమొదలులేని యూహాప్రతోళిఁదిరుగు
చెట్టులో జీవికఁ బదిలించుకొన్న
దీవెలితిలోకమునకునైర్ఘృణ్యమేలొ.

ఎన్నడో మధురించిపోయినది బ్రదుకు
హృదినిరాపాడుబరువుఁగోరికల మెసవి
మెసవి లోలోన గ్రుక్కిళ్ళు మ్రింగుకొనుచు
పాడుకొంబోలు జీవనైరర్థ్యగీతి

కంటికార్చిచ్చుమంటలే కవియదెసల
నెదనిరాశానిరుత్సాహమే గ్రసింప
కరుణఁగురిసెడుహాసవికాసమెల్ల
కూర్చునా రజనీవిటకోరకముకు.

ఆయమాయకతారక పటులెనేను
చూడసాగితి, చుక్కలేచూపులేసి
విడనశర్వరీశ్యామికావేళలందు
సందడింపని శిథిలతాజ్ఞాతసీమ.

# కాళి

ఆజగన్మాతఁబరికించినంత ఎడఁద
కలఁగిపోయివడఁకిపోయె, జలదరించె
మేను, ఉన్మత్తగాఢతమిశ్రభయద
పిశునకాఁడరేఖాలిప్రాపించెఁగనుల.

బ్రదుకునందేదో పరితాపరక్తశిఖల
రేపి, నిలువగా నీడేనిలేనివిహఁగ
మటులనారకయాతనమనుభవించి
నాయెడఁదను పూర్తిమొనర్చికొంటి.

ఆకరాళమధురమూర్తి, లోకమాత
కాంచెనన్ను క్షమాలోకనాంచలముల
ఎగసిపడితి, చెమర్చిపోయినదిబ్రదుకు
సన్నగిలె గొంతుకన్నీటి జడులఁదడిసి.

చిఱుతగాలి రెపరెపేని చెదరిపోరని
యానితాంత జీమూతగర్భాలయమున
కనలుకర్పూర ఖండశిఖాలి విరతి
లేనినాయూర్ధ్వ గమికే చలింపసాగె.

ఎవరోనాప్రకృతావస్థ ఎల్లగాంచి
నన్నుఁగాంచి జాలినొకింతనవ్విపోవ
అపుడు తెరలు తెరలుగ నవ్యక్త లజ్జ
శుష్కజీవితమందుండి సోనవాఱె.

యశశీ వాణి

“ఇదినఖంపచరుధిరవాహిని స్రవింప
దినముదినము పునీతమయినతలమ్ము
ఓయిసుకుమారకవికుమారా, యిదేటి
వనట ఇచటనా నీశోకమునకుఁదావు”

నేను

"బాష్పధారామలినమైన పతితజీవి
వలపుతడిజీఱ నునురేకపదనువోయి
నవ్యపరితాపభార వినమ్రయగుట
కిదియె మొదలాయెనో యశరీరవాణి."
అంబికాపాదలాక్షారుణాంకభాగ
ములకు జోహారువెట్టు చేతులుతమంత

నేను

"ఈనిరాశానిబిడవేదనానుతప్త
హృదికి శాంతిచేకూర శాసింపుదేవి"
అశ్రువీక్షాంచలమ్ముల నట్టెమోడ్చ
జ్యోతిరానందశీలివై సొగసినీవు
శిథిలహృదిని తేజస్సువర్షించినావు
విశ్వమపుడు ప్రేమైకరూపిణిగఁదోచె.

# ఇపుడు

తలిరుప్రాయాన సిగ్గుదొంతరలఁదాటి
కడల క్రేఁగంటఁ బరికించి, కమ్రమధుర
జీవితోల్లాసలాస్యముల్ చేసి గాలి
దుడుకు వలపు దొంతరలలో సడలి ప్రణయ
బాంధవానందమకరందభారచలిత
లలితపత్రాల తీయనివలపు లొలుకు
ప్రసవసుకుమారహృదయ మర్పణ మొనర్చి
అంతమేలేని దివ్యసౌఖ్యానురక్తి
ముగ్ధనేత్రాల నల్లన మోడ్చి నీవు
నగ్నసౌందర్యనవ్యస్వప్నాల నిపుడు
కలఁత వెలుఁగని నిదురలోకమ్ములోన
తనివి దీరఁగా గాంచుచున్నావు.

# పరిభ్రమణ

నేను దీనాతిదీనుఁడ, నిలువ నీడ
యేని లేని దరిద్రుఁడ, ఇంచుకేని
త్రుళ్ళి త్రోపాడు కారుమొయిళ్లదొంత
రలఁ బెనఁగిపోవు జీమూతరాత్రి భయద
హృదయకుహరాంతరమ్ములో నొదిఁగియొదిఁగి
బ్రతుకఁగాలేక నింక చావంగలేక
శిథిలహృద్విపంచిక నొక్క చేతఁ దాల్చి
శీర్ణజీవితమింకొక్క చేతఁ దాల్చి
కరగిపోయిన యుష్ణాశ్రుకణము కొఱకు
సురిగిపోయిన సౌందర్యసుమముకొఱకు
వెఱ్ఱినగుచు వేసారుచు వెదకికొనుచు
బ్రతుకఁగాలేక నింక చావంగలేక
తిరుగుచున్నాఁడ...

# ఆహ్వానము

నా నితాంతవియోగబాధానలమ్ము
వెలిఁగి నిలువెల్ల దహియించి వేయుచుండ
ఒక్కకన్నీటిచుక్కని యొల్క దేమి,
దుఃఖమా, దయాస్వాంతవై తొలఁగిపొమ్ము
అంతదూరాన నిన్నుగన్నంత నేను
అదరి నిట్టూర్చలేక నల్లాడిపోదు.
ఇంక కృశియించిపోదు చలించిపోదు,
ఈ ప్రవాసభరమ్ము భరింపలేను,
ఈ క్షుధాజీవయాత్ర సాగించలేను,

మృత్యుదేవతా, ఉన్మత్తనృత్యమూర్తి,
ప్రళయకాలనీలాభ్రగర్జాకరాళ
గానరావాన లోకాలు కదలిపోవ
కుటిలనిబిడాంధ మొగఁజిమ్ముకొనుచు వచ్చి
నవ్యగాఢపరీరంభణమ్మొసంగి
సేద దీర్చి నీహృదయాన జేర్చికొనుము.

# ఒకనాఁటి రేయి *

అత్మనాథునిచెంత కేనరుగఁదలఁచి
మెల్లగమనమ్ముతో సౌధవాఁటి దాఁటి
బయలు దేరితి నొంటిగా పరిమళప్ర
సన్న మధుమాసరజనీప్రశాంతవేళ.

ప్రణయగీతాలు పాడెడి పక్షిరాజి
ముగ్ధకాంతలవలె మౌనము ద్రదాల్చె
అలరుఁదీవలతోడ సయ్యాట మాని
పవనబాలుఁడు స్తబ్ధభావమ్ము జూపె

కాళ్ళయందెలు కడియాలు ఘల్లురనుచు
అడుగడుగునకు పెద్దసందడు లొనర్ప
క్రమ్ముకొనివచ్చు లజ్జాభరమ్మువలన
అడరిపడిపోయి విసవిస యగుచునుంటి.

కోమలలతానిగూఢనికుంజముందు
వెడలు యూపిరి బిగఁబట్టి వీనులొగ్గి
దెసల నాలించుచుంటి నా దేవదేవు
అడుగుచప్పుడు వినవచ్చు ననెడియాస.

ఆకుజొంపాలు గుసగుసలాడ మానె
పండుకొని నిద్రపోయెను పాంథగాని
సరసఁబడియుండు చంద్రహాసమ్ముపగిది
నిశ్చలత నొందెను స్రవంతీమతల్లి.

ఆత్మనాథుండు వచ్చి నాయంతికమునఁ
గూరుచుండినతరి నాశరీర మెల్ల
వడవడ వడంకిపోయె నాయెడఁద కలఁగె
మూఁతవడిపోయె నానేత్రములు తమంత.

రాత్రి గాఢాంధకారనీరంధ్ర మయ్యె
మబ్బు తెర గ్రమ్మె తారకామండలమున
అనిలుఁడే తెంచి దీపంబుఁ నార్పివైచె.

నాయెద వెలుంగు ఆభరణమ్ము దివ్య
కాంతులను గ్రక్కుచున్న దేకరణి దీని
దాఁచుటో నే నెఱుంగ.

* రవీంద్రునితోట మాలినుండి